ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 22.0

భీమవరానికి జనసేనాని

14న రాక.. ముఖ్య నాయకులతో భేటీ



(భీమవరం- ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు. తెలుగుదేశం - జనసేన పొత్తు పొడిచిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. ఆ దిశగా షెడ్యూల్ ఖరారైంది. ఫిబ్రవరి 14 నుంచి 17 నుంచి ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించనున్నట్టు జనసేన జిల్లా నేతలకు సమాచారం అందింది. తొలి రోజు భీమవరంలో పర్యటిస్తారు. ఆరోజు జిల్లాలోని ముఖ్యనాయకులు, ప్రభావశీలురుతో సమావేశం కానున్నారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలో పర్యటిస్తారు. జిల్లా కేంద్రాల్లోనే పవన్ కల్యాణ్ పర్యటన ఉండేలా పార్టీ షెడ్యూల్ రూపొందించింది. భీమవరంలో పవన్ కల్యాణ్ పోటీ చేసే అవకాశాలు ఉండడంతో తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. తెలుగుదేశం - జనసేన పొత్తులో భీమవరం జనసేనకు కేటాయిస్తారంటూ ఇరు పార్టీల్లోనూ ఏకాభిప్రాయం ఉంది. ఇప్పటికే పొత్తుల్లో కేటాయించే సీట్లపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. జిల్లాలో జనసేనకు కేటాయించే సీట్లపై ఇరు పార్టీల్లోనూ చర్చ సాగుతోంది. వాస్తవానికి ఫిబ్రవరి 14న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాలకొల్లులో పాదయాత్ర నిర్వహించి బహిరంగ సభలో పాల్గొంటారని భావించారు. బీజేపీతోనూ పొత్తుపై సంప్రదింపులు జరుగుతుండడంతో ఇరు పార్టీల అధినేతల పాదయాత్ర వాయిదా పడింది. అదే రోజున భీమవరంలో పవన్ కల్యాణ్ పర్యటన ఉంటోంది. ఎన్నికల నాటికి భీమవరంలో మూడు పర్యాయాలు పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 14న నిర్వహించే తొలి విడత పర్యటనలో ముఖ్య నాయకులతో సమావేశాలు ఉంటాయి. రానున్న ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేయనున్నారు. తదుపరి పర్యటనలో పార్టీ ముఖ్యకార్యకర్తలు, వీరమహిళలతో భేటీ అవుతారు. మూడో పర్యటనలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఇలా ఎన్నికల నాటికి మూడు పర్యాయాలు పవన్ పర్యటన జిల్లాలో కొనసాగనుంది. పొత్తులు, ఇరుపార్టీల మధ్య సహృద్భావ వాతావరణం ఉండేలా సమావేశంలో చర్చించనున్నారు.

నవోదయ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు శనివారం జిల్లాలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1,021 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 516 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 501 మంది దరఖాస్తు చేసుకోగా 302 మంది హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలను డీఈవోతో పాటు, పెదవేగి జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు సందర్శించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.



చంద్ర ప్రభ వాహనంపై లక్ష్మీ నరసింహ స్వామి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 10: రథసప్తమి తిరునాళ్ళ సందర్భంగా సోమవారం చంద్ర ప్రభ వాహనంపై శోభనాచల లక్ష్మీ నరసింహ స్వామి వారు నిత్య కల్యాణార్థం పెద్దకొరాయికి విచ్చేశారు. ఉదయం ఎగువ సన్నిధిలో జరిగిన కార్యక్రమంలో నవ కలశ పంచామృత స్నపన, విశేషాలం కరణ, తులసీ దళార్చన, అమ్మవార్లకు రజత పుష్పార్చన జరిగింది. సాయంత్రం నిత్యకల్యాణం జరిగింది. నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు.

డీఎస్సీ కొట్టేదెలా?



రేపు నోటిఫికేషన్.. నెల రోజుల్లో పరీక్ష

- ప్రిపరేషన్‌కు సమయం ఎలా సరిపోతుంది.. పోస్టులు పరిమితం.. నిరుద్యోగులు అధికం
- రెగ్యులర్ నియామకాలు లేక మూతపడ్డ కోచింగ్ సెంటర్లు.. ఐదేళ్లుగా పట్టించుకోని జగన్
- ఎన్నికల ముందు హడావిడి.. ఆందోళనతో తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

'గతంలో డీఎస్సీ రాశాను. మార్కులు వచ్చినప్పటికీ ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించే మార్కులు సాధించలేకపోయా. తర్వాత మెగా డీఎస్సీ తీసుకువస్తానని జగన్ ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో ప్రిపరేషన్ వైపు చూడకుండా ఆదాయం కోసం ఓ ఉద్యోగంలో చేరాను. ఈ తరుణంలో సడెన్‌గా డీఎస్సీ నోటిఫికేషన్.. నెల రోజుల్లో పరీక్ష అని తెలియడంతో శిక్షణ ఎక్కడ పొందాలి ? సమయం సరిపోదు. శిక్షణ ఇచ్చే కోచింగ్ సెంటర్లు లేవు. కోచింగ్ లేకపోతే లక్షల మంది అభ్యర్థుల మధ్య పోటీలో నిలబడలేం. పోస్టులు సాధించలేం' అంటూ భీమవరానికి చెందిన నిరుద్యోగి పి.వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : 'రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి పోస్టులు భర్తీ చేస్తాం' అని జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. నిజమేనని నమ్మిన నిరుద్యోగులంతా ఓట్లు వేసి ఆయనను సీఎం చేశారు. ఆ వెంటనే కోచింగ్ సెంటర్లలో నెలల తరబడి శిక్షణ తీసుకున్నారు. కాని, ఎంతకీ డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడంతో తమను జగన్ నమ్మించి మోసం చేశాడని అర్థం చేసుకున్నారు. మరోవైపు పాఠశాలల విలీనం, మరోపక్క ఉపాధ్యాయ పోస్టుల సర్దుబాటుతో డీఎస్సీపై పూర్తిగా ఆశలు వదులుకున్నారు. కోచింగ్ సెంటర్ల నుంచి తిరిగి వచ్చేశారు. ఇలా ఒక్కొక్కరుగా బయటకు వచ్చేయడంతో ఆ సెంటర్‌లు మూతపడ్డాయి. ఇప్పుడు రెండు వారాల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుందనగా.. ఐదేళ్లు నిద్రపోయిన జగన్ సర్కారు ఇప్పుడే నిద్ర లేచి మినీ డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చింది. మెగా డీఎస్సీ స్థానంలో మినీ డీఎస్సీ ఇవ్వడాన్ని బీఈడీ, టీటీసీ నిరుద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ మరిచి విలీనం

ప్రభుత్వం రెండేళ్లుగా స్కూళ్ల విలీనం చేపట్టింది. అప్పట్లో డీఎస్సీ మాట గుర్తుకురాలేదు. విద్యార్థులను ఇబ్బంది పెట్టి మరీ ఉమ్మడి జిల్లాలో ఒకేసారి 280 పాఠశాలలు విలీనం చేశారు. విలీనమైన పాఠశాలలో ఉపాధ్యాయులను సర్‌ప్లస్ టీచర్లుగా పేర్కొంటూ ఇతర పాఠశాలలో ఖాళీ వున్నచోట భర్తీ చేశారు.





కోచింగ్ తీసుకునేదెలా ?

వైసీపీ ప్రభుత్వానికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు తీయడానికి ఐదేళ్ళ సమయం సరిపోలేదు. ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలోనే పెట్టాలనిపించింది. అందుకనేమో నెల రోజులలో పరీక్ష సమయం డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఇచ్చింది ఈ నెల 12వ తేదీ నుంచి పరీక్ష ఫీజు చెల్లింపు మొదలుకానుంది. వచ్చే నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. అంటే నెల రోజులు సమయం మాత్రమే అభ్యర్థులకు ప్రిపరేషన్ సమయం ఉంది. ఎలా సరిపోతుందనే మాటలు నిరుద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీ అనే మాట మొన్నటి వరకు వినబడకపోవడం ఇతర ప్రభుత్వ ఉద్యోగ పోస్టులకు నోటిఫికేషన్ల అనేమాట లేకపోవడంతో మూడేళ్ళుగా జిల్లాలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కోచింగ్ సెంటర్‌లు మూసివేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వందకు పైగా కోచింగ్ సెంటర్లలో ఏటా లక్ష మందికి పైగా శిక్షణ పొందుతూ ఉండేవారు. ఇప్పుడు ఒక్క కోచింగ్ సెంటర్ లేదు. దీంతో ఈ నెల రోజుల డీఎస్సీ పరీక్షకు శిక్షణ పొందే అవకాశం నిరుద్యోగులకు లేకపోయింది. మెటీరియల్ అందుబాటులో లేదు. దీంతో ఎన్నికల డీఎస్సీ నిరుద్యోగులలో గందరగోళంగా మారింది.

విద్యార్థులు తగ్గడంతో..

ప్రభుత్వ నూతన విధానంలో రెండేళ్లుగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతూ వస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 1,352 ప్రభుత్వ పాఠశాలల్లో గడిచిన రెండేళ్లలో లక్ష 37 వేల 863 విద్యార్థుల నుంచి లక్షా ఐదు వేల 117కు పడిపోయింది. ఈ లెక్కన 32,746 మంది తగ్గారు. అలాగే ఏలూరు జిల్లాలో 1200 పాఠశాలల్లో 24 వేల మంది స్కూళ్లు మానేశారు. దీనివల్ల ఉపాధ్యాయుల భర్తీ సంఖ్య తగ్గిపోయే అవకాశం ఉంది. అందుకనే 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 306 పోస్టులు మాత్రమే ఉంటాయి. లక్షల మంది నిరుద్యోగులకు 306 పోస్టులతో భర్తీసరి.. 'మిగిలిన నిరుద్యోగులకు ఏది.. ఉపాధ్యాయ ఉద్యోగం' అనేలా ప్రభుత్వ విధానం మారింది.

డీఎస్సీ షెడ్యూలు

12న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 22 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం. ఈ నెల 12 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లింపు. మార్చి 5 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం. మార్చి 15 నుంచి 30 వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు జరుగుతాయి.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

- రాష్ట్రంలో 10 లక్షల మంది అభ్యర్థులు ఉంటే 6,100 డీఎస్సీ పోస్టులతో ఎలా న్యాయం చేస్తారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలి. ఒక్క పశ్చిమ గోదావరిలోనే 45 వేల మంది డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో అతి స్వల్ప సంఖ్యను ప్రకటించి చేతులు దులుపుకోవడం దుర్మార్గం.

  \- ఎస్‌వీఎన్ శర్మ, గేదెల ధనుష్

- మెగా డీఎస్సీని నిర్వహిస్తామని చెప్పిన సీఎం జగన్ ఇప్పుడు మినీ డీఎస్సీని నిర్వహించడం నిరుద్యోగులను మోసం చేయడమే. తక్షణం ఈ డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీ నిర్వహించాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తాం.

  \- సీహెచ్.సుందర్, టి.అప్పలస్వామి

అన్నం తినేదెలా ?

బియ్యం ధరలు పైపైకి

- 26 కేజీల సన్న బియ్యం బస్తా రూ.1700
- ధరల నియంత్రణకు కానరాని చర్యలు..
- ఏ కొంటాం.. ఏం తింటామంటూ సామాన్యుల ఆవేదన



ముదినేపల్లి, ఫిబ్రవరి 10 : బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. వారం రోజుల్లోనే పది శాతం పైగా బియ్యం ధరలు పెరిగాయి. మధ్య తరగతి, ఆపై వర్గాల వారు సన్న బియ్యంపై మొగ్గు చూపిస్తుండడంతో రకరకాల పేర్లతో వ్యాపారులు బియ్యం ధరలను పెంచేస్తున్నారు. సామాన్యులు, చిరుద్యోగులు, వివిధ రకాల వృత్తులపై ఆధార పడిన వారు పెరుగుతున్న బియ్యం ధరలను భరించలేకపోతు న్నారు. గతంలో సన్న రకం బియ్యం వెరైటీని బట్టి 26 కేజీల బస్తా రూ.1,150 నుంచి రూ.1,300 వరకు ఉండేది. ఇప్పుడు ఆ ధర రూ.1,400 నుంచి రూ.1,700 వరకు పెరిగిం ది. గత ఆరు నెలల్లో రూ.250 నుంచి రూ.400 వరకు ధరలు పెరిగాయి.

నియంత్రణ ఏది..?

ప్రభుత్వం నుంచి లైసెన్సు పొంది జీఎస్టీ పరిధిలో ఉంటూ హోల్ సేల్ డీలర్లు, ట్రేడర్లు బియ్యం ధరలను విచ్చలవిడిగా పెంచుతుంటే సివిల్ సప్లయిస్ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో బియ్యం ధరలు కేజీ ఒక్కింటికి రూ.45 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. సన్నరకం, హెచ్ఎంటీ, స్టీము రకరకాల పేర్లతో బియ్యం ధరలను పెంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నా యంటూ కొన్ని రకాల బియ్యం ధరలను మరింత పెంచుతున్నారు. బియ్యం సంచులపై వివిధ రకాల బ్రాండ్ల పేర్లు చూపించి సూపర్ ఫైన్ రకం అంటూ 26 కేజీల బస్తా రూ.1,500 నుంచి రూ.1,650కి వ్యాపారులు అమ్ముతున్నారు. గతంలో తూర్పు గోదావరి జిల్లా మండపేట, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లోని హోల్ సేల్ డీలర్ల నుంచి దిగుమతి చేసుకున్న సమయంలో బియ్యం ధరలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆ ప్రాంతాల నుంచి బియ్యం దిగుమతులు తగ్గి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు జరుగుతుండడంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ వర్గాల ప్రజలు బియ్యం కొనుగోలు చేయాలంటేనే హడలెత్తిపోతున్నారు. అదుపు లేకుండా పెరుగుతున్న బియ్యం ధరలను చూసి ప్రజలు ఆందోళన చెందుతుంటే సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

ధాన్యం అమ్మకం.. బియ్యం కొనడం

రైతులు తాము పండించిన ధాన్యాన్ని గతంలో మిల్లింగ్ చేయించి బియ్యాన్ని వినియోగించేకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధిక శాతం రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా అమ్మేసి సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్ పెరిగింది. వినియోగదారులు పెరగటంతో ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం వినియోగదారుల నుంచి బహిరంగ మార్కెట్‌లోకి చేరుకుంటోంది. ఎక్కువ శాతం మంది ఉచిత బియ్యాన్ని కేజీ రూ.8 నుంచి రూ.10లకు వ్యాపారులకు అమ్మేస్తున్నారు. దీంతో సన్న బియ్యం, మధ్య రకం బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వం పట్టించుకోవాలి



మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. సామన్యుడు బియ్యాన్ని కొనుగోలు చేయలేకపోతున్నాడు. వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్టు ధరలను పెంచుతుంటే కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు.

\- సత్యవోలు నాగలక్ష్మి, బీజేపీ ముదినేపల్లి మండల అధ్యక్షురాలు

ఈ టిక్కెట్ ఎవరిది ?

టీడీపీకా..? జనసేనకా ? పొత్తులో ఎవరు పోటీ చేస్తారు ?

తాడేపల్లిగూడెంపై భారీగా పందేలు.. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లపైనా బెట్టింగ్



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

'తాడేపల్లిగూడెం టిక్కెట్ జనసేనకు కేటాయిస్తార'ని ఒకరంటే, 'కాదు.. కాదు.. టీడీపీ పోటీ చేస్తుంది. కావాలంటే బెట్' అంటూ మరొకరు పందేనికి తెరలేపారు. దీంతో ఇద్దరి మధ్య లక్షల్లో పందెం కుదిరింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఇంకా విడుదల కాకపోయినా పొత్తుల్లో ఎవరికి ఏ సీటు కేటా యిస్తారనే దానిపై పందెం రాయుళ్లు పోటీ పడుతున్నారు. ఇప్పటికే కోట్లల్లో బెట్టింగులు కాశారు. జిల్లాల వారీగా పార్టీలకు వచ్చే సీట్లపైన బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు లభిస్తాయన్న విషయంపైనా పందేలు సాగుతున్నాయి. జిల్లాలో ఏ సీటు ఎవరికి వస్తుందనే దానిపైనా బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. కాలు దువ్వుతున్నారు. తెలుగుదేశం-జనసేన పొత్తు ఖరారైన తర్వాత పందేలు జోరందుకున్నాయి. భీమవరం, ఏలూరు కేంద్రంగా పందెం రాయుళ్లు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం-జనసేన కూటమి విజయం సాధిస్తుందంటూ కొందరు బెట్టింగ్‌లకు కాలు దువ్వుతున్నారు. వైసీపీకి ఒక్క సీటు లభించందంటూ అంచనా వేస్తున్నారు. ఆ దిశగా పందేలు సాగుతున్నాయి. తెలుగుదేశం-జనసేన సీట్లు ఖరారైన తర్వాత పందేలు మరింత జోరందుకోనున్నాయి. సీట్ల ప్రకటన కోసం పందెం రాయుళ్లు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో తెలుగుదేశం కూటమి సీట్ల కేటాయింపుపై స్పష్టత వచ్చిన తర్వాత పందేలు పెరగనున్నాయి. ఇప్పటికే ఒక్కో వ్యక్తి రూ.25 లక్షలు నుంచి కోటి వరకు పందేలు కాశారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సీటు ఎవరికి వస్తుందన్న విషయంపైనా బెట్టింగులకు సై అంటున్నారు. పందెం రాయుళ్లతో తెలుగుదేశం కూటమి శ్రేణులు, వైసీపీ శ్రేణులు జత కలుస్తున్నారు. ఎవరికి అనుకూలంగా వారు బెట్టింగులు కడుతున్నారు. సర్వే నివేదికలు, సొంత అంచనాలతో పందెంరాయుళ్లు రంగంలోకి దిగుతున్నారు. సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చిన తర్వాత బెట్టింగుల జోరు పెరగనుంది. ఇప్పటికే వైసీపీలో తణుకు, ఆచంట, భీమవరం, నర్సాపురం, పాలకొల్లు నియోజక వర్గాల్లో స్పష్టత వచ్చింది. తాడేపల్లిగూడెంలో స్పష్టత రావాల్సి ఉంది. తెలుగుదేశం-జనసేన కూటమి లోనూ సీట్ల సర్దుబాటుపై తర్జన భర్జనలు పడుతున్నారు. సీట్ల ప్రకటన తర్వాత గెలుపు ఓటములపై పందేలపై ముందుకు రావాలని ఇంకొందరు బెట్టింగు రాయుళ్లు వేచి చూస్తున్నారు.



ఈసీ వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 10 : ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ-సంసిద్ధతపై శనివారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు నియమించే సిబ్బందికి శిక్షణ, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో కనీస ప్రాథమిక సౌకర్యాలు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ, రవాణా సౌకర్యాలు, తదితరాలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రాథమిక శిక్షణ ఇచ్చామని, ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలోని 1,191 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కి ఏర్పాట్లు చేశామని, జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని వేలేరుపాడు, గెడ్డపల్లి వంటి మారుమూల గ్రామాలకు వాహనాల ద్వారా పోలింగ్ సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఎన్నికలలో నియమావళి ఉల్లంఘన అంశాలను పరిశీలించేందుకు 502 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లకు 9,874 మంది పోలీస్ సిబ్బంది అవసరం అవుతారని, ఎస్పీతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవోలు ఎన్ఎస్‌కె ఖాజావలి, అద్దయ్య, భవాని శంకరి పాల్గొన్నారు.

ఏటిగట్టు జారడం సహజం

నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ల బృందం వెల్లడి



ఏటిగట్టు కోతను పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ ఈఎన్‌సీలు

నరసాపురం, ఫిబ్రవరి 10 : 'నేలను బట్టి గట్టు జారడం సహజం. రాయి నాణ్యతకు, గట్టు కుంగిపోవడానికి సంబంధం లేదు. రాళ్ళల్లో నాణ్యత లేదంటూ చేస్తున్న విమర్శలు అవాస్తవం. వాటిని పరీక్షించిన తర్వాతే ఏటిగట్టు పనులకు వినియోగిస్తున్నాం' అని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ల బృందం స్పష్టం చేసింది. శనివారం నరసాపురం పట్టణంలో కోతకు గురైన ఏటిగట్టును గోదావరి డెల్టా సిస్టమ్స్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, నీటిపారుదల శాఖ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు, సెంట్రల్ డిజైన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసయాదవ్, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ సలహాదారుడు గిరిధర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈలు శివకుమార్‌రెడ్డి, శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 'గట్టు జారడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. పునాదుల్లో రాళ్ల సర్దుకునే వరకు ఇలా జారుతూనే ఉంటాయి. దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏదైనా లోపం ఉంటే నిపుణుల సలహా తీసుకుని పనులు చేస్తాం. మరోసారి నీటి అడుగుభాగంలోని మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేస్తాం' అని వివరించారు. ఈఈలు కాశీవిశ్వేశ్వరరావు, శేషుబాబు, డీఈ శ్రీనివాస్, ఏఈ సుబ్బారావు, పవన్‌కుమార్ ఉన్నారు.

ఏపీ నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాస్‌మూర్తి



భీమవరం, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 10:తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బూదరాజు శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు. గతంలో నాగపూర్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రమోద్ ఎం.పడోలే నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో శ్రీనివాస్ మూర్తిని కేంద్ర ప్రభుత్వం నియమించింది.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌వోల సంఘం



భీమవరం, ఫిబ్రవరి 10 : జిల్లాలో ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందిన వీఆర్వోలకు వారు కోరుకున్న ప్రాంతాలకు నియమించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వీఆర్వోల సంఘం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు శనివారం కలెక్టరును ఆమె ఛాంబర్‌లో కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 21 మంది వీఆర్వోలకు పశ్చిమ గోదావరి జిల్లాకు 9 మంది సీనియర్ అసిస్టెంట్లను కేటాయించారని, వారందరినీ వారికి కావలసిన మండలాల్లో నియమించాలని కోరారు.ఇటీవల బీఎల్‌వో డ్యూటీలు చేస్తున్న వీఆర్వోలను, వెల్ఫేర్ అసిస్టెంట్లులను, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లులను ఓటర్ల జాబితాలో చిన్నచిన్న తప్పులు ఉన్నాయని సస్పెండ్ చేస్తున్నారని దీంతో వారంతా మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారందరినీ తిరిగి విధుల్లోకి తీసు కోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఎవరికి ఇబ్బందులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య , భీమవరం డివిజన్ అధ్యక్షుడు కెనడి, భీమవరం మండల వీఆర్‌వోల అధ్యక్షుడు రత్నరాజు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



వెంకటాద్రిపురంలో డ్వాక్రా సభ్యులతో కలెక్టర్ సతీమణి మానస

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 10: మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస కోరారు. శనివారం కనకాద్రిపురం గ్రామంలో ఆమె పర్యటించారు. ఆ గ్రామంలోని గుడ్‌హెల్త్ మిల్లెట్ ఫుడ్స్‌ను పరిశీలించారు. మదర్ థెరిస్సా మహిళా స్వయం సహాయక సంఘాన్ని ఆమె అభినం దించారు. డ్వాక్రా మహిళలు ఇలాంటి వస్తువులను మార్కె టింగ్ చేస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు. మండల సమాఖ్య మహిళా అధ్యక్షురాలు తోట కృపామణి, మహిళా సంఘం మహిళలు స్నేహ ఉన్నారు.

అన్ని స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ పోటీ

పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు



గణపవరం, ఫిబ్రవరి 10: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరి కుమార్‌రాజు వెల్లడిం చారు. శనివారం గణపవరం మండలం పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 175 ఎమ్మెల్యే స్థానాలకు ఇప్పటివరకు 950 మంది దరఖాస్తు చేశారని, 25 పార్లమెంట్ స్థానాలకు 145 మంది దరఖాస్తులు అధిష్టానానికి అందించారని అన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు పోటీ చేసేందుకు ఆసక్తి కనపరిచే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను పార్టీ అధిష్టానం స్వీకరిస్తుందన్నారు. నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగానూ, ఏలూరు జిల్లా ఉంగుటూరు అసెంబ్లీ అభ్యర్థిగా తాను దరఖాస్తులను అందజేశానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వైసీపీ పాలనలో విసిగి పోయిన ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు.

భీమవరంలో ఓపెన్ రాపిడ్ చదరంగం పోటీలు



భీమవరం అర్బన్, ఫిబ్రవరి 10: భీమవరం జీవీఆర్ కళ్యాణ మండపంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రంధి వేంకటేశ్వర రావు స్మారక ఓపెన్ రాపిడ్ చదరంగ పోటీలను శనివారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ ప్రారంభించారు. క్రీడలలో విద్యార్థులు రాణించేలా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తోట బోగయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 20 జిల్లాల నుంచి 166 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటాయన్నారు. మాదాసు కిషోర్, భీమారావు, గమిని పవన్, కోటిపల్లి బాబు, చెరుకువాడ రంగసాయి, కామన నాగేశ్వర రావు, కోడే యుగందర్, పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

మేం ఉండలేం సారో..



సభ జరుగుతుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

ఆసరా సభ నుంచి వెనుదిరిగిన మహిళలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10 : ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆసరా నాలుగో విడత సభ నిర్వహించారు. ఈ సభకు ఏలూరు కార్పొరేషన్‌లోని అన్ని వార్డులతో పాటు డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకొచ్చారు. మహిళలను సభకు రప్పించేందుకు వెలుగు సిబ్బంది సంఘ సభ్యులపై ఒత్తిడి చేశారు. సభకు ఖచ్చితంగా రావాలని లేదంటే ఆసరా పథకం వర్తింప చేయబోమని, ఇతర పథకాలు నిలిపి వేస్తామని బెదిరించినట్టు విమర్శలు ఉన్నాయి. లబ్ధి పొందు తున్న మహిళలంతా తప్పనిసరిగా సభకు రావాలని చెప్పడంతో చాలా మంది సభకు అయిష్టంగానే హాజరయ్యారు. ఆటోల్లో సభకు బలవంతంగా తరలించారు. అయితే సభాస్థలిలో వీరికి తగిన ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. దీనికితోడు మధ్యాహ్నం రెండు గంటలకు నుంచి ఎండలో మహిళలు పడిగాపులు కాశారు. చివరకు సభ ఆలస్యంగా సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైంది. అప్పటికే నీరసించిన మహిళలు ఓపిక నశించి మేం ఉండలేం.. అంటూ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రసంగిస్తుండగానే సభ నుంచి బయటకు దారి తీశారు. ఒక్కసారిగా మహిళలు కుర్చీల నుంచి లేచి వెనుదిరుగుతుండడంతో మెప్మా సిబ్బంది, ఆర్పీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కంగారు పడి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు ఆగకుండా వారిని తోచుకుంటూ బయటకు వచ్చేశారు. వైసీపీ నాయకులు ఆగండి.. ఆగండి అని కేకలు వేసినా ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో వైసీపీ నాయకులు ముఖాలు వాడిపోయాయి. గేటు వద్ద పోలీసులు సైతం నిలువరించి లోపలకు వెళ్లాలంటూ అడ్డుకోబోయి విఫలమయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆళ్లనాని జ్యోతి వెలిగించి ప్రారం భించారు. రూ.27 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. మెప్మా ఆధ్వర్యంలో వివిధ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను నాని ప్రారంభించారు. మేయర్ షేక్ నూర్జహాన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్‌బాబు, శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎన్.చిరంజీవులు, మెప్మా పీడీ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలను ఆటోల్లో సభకు తరలిస్తున్న దృశ్యం



జనం బయటకు వెళ్లకుండా గేటు మూస్తున్న కార్యకర్తలు

అంజుమన్ ఎన్నికలకు కమిటీ ఏర్పాటు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 10: ప్రముఖ ముస్లిమ్ సంస్థ అంజుమన్ మొహాఫిజిల్ ఇస్లాం సంస్థకు ఎన్నికలు జరిపించాలని కొన్నేళ్లుగా సంస్థ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. గతేడాది సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. సబ్ కమిటీ సైతం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టింది. దీంతో సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సమావేశమై సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు ఐదుగురితో ఎన్నికల కమిటీ ఏర్పాటు చేసింది. నగరంలో అనేక ఆస్తులు, ఆదాయం ఉన్న అంజుమన్ సంస్థపై పట్టుకోసం ముస్లిమ్‌లోని కొన్ని వర్గాలు ఎప్పుడు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. గతంలో ఈ సంస్థ పాలక వర్గం పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరోవర్గం కోర్టుకు వెళ్ళి ఎన్నికలు నిర్వహించేలా ఆర్డర్ తెచ్చుకుంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో పాతపాలక వర్గాన్ని కాదని, కొత్తగా పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ వర్గం కూడా పాతవర్గం తరహాలోనే పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించక పోవడంతో మరోసారి వివాదం మొదలైంది. రెండేళ్ల క్రితమే పాలకవర్గం గడువుముగిసినా బైలా ప్రకారం ప్రతిఏటా జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక్క సంవత్సరం కూడా సమావేశం నిర్వహించకపోవడంతో మరోవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది ఆగస్టులో సర్వసభ్య సమావేశం నిర్వహించి అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. రెండునెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేశారు. అయితే అడ్‌హక్ కమిటీ సైతం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడంతో పాలక వర్గంలోని 16 మంది సభ్యులు ఇటీవల కోర్టులో కేసు వేశారు. దీంతో ఈ వ్యవహారంపై రెండువర్గాల నాయకులు ఒకరిపై ఒకరు వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటూ సమస్యను జఠిలం చేశారు.శనివారం అడ్‌హక్ కమిటీ సమా వేశం జరిగింది. దీంతో ఎన్నికల నిర్వహణకు ఐదుగురి సభ్యులు ఎమ్డీ ఇబ్రహీం, ముదాహిద్, షేక్ జమ,ఎమ్డీ ఇలియాస్, మున్వర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంజుమన్ వద్ద పోలీసులు సైతం పహారా కాశారు.



అంజుమన్ వద్ద పోలీసులు పహారా



ఏమిటీ నిర్లక్ష్యం..

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: కొందరి నిర్లక్ష్యం.. మరికొందరికి ప్రాణ సంకటంగా మారుతోంది. పామాయిల్ తోటల్లో వయసు మీరిన పామాయిల్ చెట్లను రైతులు తొలగిస్తున్నారు. తొలగించిన పామా యిల్ మొద్దులను ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా నూజివీడు బైపాస్ రహదారి మార్జిన్‌లలో వదిలివేస్తున్నారు. రాత్రిపూట వేగంగా వెళ్ళే వాహన దారులు మార్జిన్‌లో ఉన్న ఈ చెట్లను గమనించకుండా ఏమరపాటుగా వెళితే ప్రమాదానికి గురికాక తప్పదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారులపై వదిలివేసిన పామాయిల్ మొద్దులను తొలగించాలని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

16 నుంచి 24 వరకూ అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు




దెందులూరు, ఫిబ్రవరి 10 :కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సంతాన లక్ష్మీగా పేరు పొందిన గాలాయ గూడెం అచ్చమ్మ పేరంటాలమ్మతల్లి 67వ వార్షికోత్సవాలను ఈనెల 16 నుంచి 24వతేదీ వరకూ నిర్వహిం చేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లను చేసింది. సుమారు ఉత్సవాలకు లక్ష మంది వరకూ భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 16 తెల్లవారు జాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. పుట్టింటి వారి సారె, పసుపు, కుంకుమ, బోనాలు, నైవేద్యం సమర్పించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఉత్సవాల రోజుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సభ్యులు తెలిపారు. 24 శనివారం మధ్యాహ్నం నిప్పులగుండం ఉంటుంది. 25న అన్నదానం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది.

చిన వెంకన్నకు భక్తుల తాకిడి



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10: శ్రీవారి దివ్యక్షేత్రం శనివారం భక్తుల రాకతో కళకళలాడింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి రద్దీ పెరిగింది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. సుమారు 20 వేలమంది వరకూ యాత్రికులు స్వామివారిని దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. కేశఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకుని స్వామివారి దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 3గంటల పైబడి సమయం పట్టింది.

సనాతన ధర్మ పరిరక్షణకు విద్యారణ్య మహర్షి కృషి



ప్రవచనాలు చెబుతున్న గరికిపాటి నరసింహారావు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 10 : విద్యారణ్య మహర్షి సనాతన ధర్మం కోసం ఎంతో కృషి చేశారని ప్రవచన కర్త పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు అన్నారు. భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో విద్యారణ్య మహర్షి విరచితం ప్రవచనంలో భాగంగా శనివారం రాత్రి అభిభాషణ చేశారు. 1380-1386 సంవత్సర కాలంలో అంటే 14వ శతాబ్దంలో శృంగేరి శారదా పీఠానికి ఆయన 12వ పీఠాధిపతిగా చేశారు. ఆయన ఎన్నో అద్వయత గ్రంథాలు రాశారని, వారే కాకుండా వారి శిష్యులు ఎన్నో గ్రంథాలు రాశారన్నారు. విజయనగర సామ్రాజ్య స్థాపనకు మూలకారకులన్నారు. నాలుగు వైపులా నాలుగు పీఠాలు స్థాపించి సనాతన ధర్మాన్ని కాపాడారని తెలిపారు. టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ విశ్వనాథరాజు, సీతారామరాజు, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణరావు, కంతేటి వెంకట రాజు, చంద్రాజీ, పైడిరాజు, కనకరాజు వబిలిశెట్టి, మంతెన రాంకుమార్ రాజు, ప్రభావతి పాల్గొన్నారు.

లంచం ఇవ్వలేదని మా పాక పీకించారు

ఏఎంసీ చైర్మన్ పై వైసీపీ కార్యకర్తల ఆరోపణ



మాట్లాడుతున్న శ్రీను, సుబ్బారావు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 10: తాడేపల్లి గూడెం మండలం జగన్నాధపురంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ తాను అడిగిన లంచం ఇవ్వలేదని వైసీసీ కార్యకర్తలమైన తమపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని యర్రసాని శ్రీను ఆరోపించారు. తాడేపల్లి గూడెంలోని ధనా రెసిడెన్సీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి తాము కులవృత్తి చేసుకుని జీవనం సాగిస్తు న్నామని చేపల చెరువులో చేపలు పట్టుకునేందుకు రూ.2 లక్షలు లంచం అడిగారని ఆ విషయాన్ని మా కులపెద్ద, మాజీ కౌన్సిలర్ సింగం సుబ్బా రావు ద్వారా మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో కక్ష తాము వ్యాపారం చేసుకునే చేపల దుకాణం తీయించాడ న్నారు. సింగం సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీలో ఉన్న తమపైనే ఏఎంసి చైర్మన్ వ్యవహార శైలి దుర్మార్గంగా ఉందన్నారు. తనపై అవినీతి ఆరోపణలు చేయడం సులువేనని వాటిని నిరూపించాలని గతంలో జగన్నాధపురంలో జగనన్న కాలనీలో చెరువులో కంకర తీసి రూ.25 లక్షల వరకూ బిల్లు చేసుకుని మింగేశాడని ఆరోపించారు.సమావేశంలో బాధితుల బంధువులు యర్రసాని వెంకటలక్ష్మి, కుమారి, నాగమణి, జల్లి సత్యనారా యణ, ఎస్టీ సంఘ మెట్ట ఉప్పరగూడెం అధ్యక్షుడు చినర్తి దుర్గారావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



ప్రమాదానికి కారణమైన లారీ వద్ద గుమికూడిన ప్రజలు

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

తప్పిన పెనుముప్పు.. విద్యార్థులకు స్వల్పగాయాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10: బుట్టాయిగూడెం జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు స్కూల్ బస్సును లోడు లారీ ఢీకొంది. అందులో ఉన్న విద్యార్థులు స్వల్పగాయాలతో బయట పడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దూబచర్లకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను తీసుకుని స్కూల్‌కు వెళ్తోంది. ఇదే సమయంలో ఒడిశా నుంచి ఫర్నీచర్ లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనలతో కేకలు వేశారు. స్కూల్ బస్సు పాక్షికంగా ధ్వంసమైంది.

పనిచేస్తూ షాక్ కొట్టి స్తంభంపైనే మృతి



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. ఎల్‌సీ ఇవ్వకుండా మరమ్మతుల నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కిన అతను విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే మృతిచెందాడు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన కొందరు మండలంలోని కొమ్మరలో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఎల్‌సీ లేకుండా బ్రోజన్ (22) అనే వ్యక్తి స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుత్ ప్రవహిస్తుండటంతో షాక్‌కు గురయ్యాడు. స్తంభం మీదే మృతిచెందాడు.

మానసిక ఒత్తిడితో యువతి ఆత్మహత్య

లింగపాలెం, ఫిబ్రవరి 10: మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. లింగపాలెం మండలం కె.గోకవరం గ్రామానికి చెందిన కె.స్వర్ణలత (30) మానసిక స్థితి బాగుండక చనిపోతున్నట్లు సూసైడ్ లెటర్ రాసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.

నాటు సారా విక్రయాలు.. కేసు నమోదు

చింతలపూడి, ఫిబ్రవరి 10 : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్‌లో ఎస్ఈబీ దాడుల్లో నాలుగు నాటుసారా కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం గ్రామంలో దాడులు జరిపి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2,100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. కామవరపుకోట మండలంలో ఒక వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ చింతలపూడి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏలూరు ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

పేకాటపై దాడి..9 మంది అరెస్టు

ఉండి, ఫిబ్రవరి 10 :పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి రూ.9330 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఉండి ఎస్ఐ లక్ష్మీణ్ తెలిపారు. ఉండి భవానీపేటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏలూరు క్రైం : ఏలూరు రూరల్ మండలం గాయిత్రీ నగర్‌లో పేకాట ఆడుతున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి తన సిబ్బందితో దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రెండు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

లంకలకోడేరులో కోడిపందేలపై దాడి

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి, 10 : లంకలకోడేరు గ్రామంలో కోడిపందేలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.1200 నగదు, 8 మోటారు సైకిళ్లు, 3 కోళ్లు, 15 కోడికత్తులు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాలకొల్లు సీఐ కుడిపూడి సతీష్, ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది దాడి చేశారు.

రూ.78,500 నగదు స్వాధీనం

ముసునూరు, ఫిబ్రవరి 10: గోగులంపాడులో శనివారం కోడి పందేల శిబిరంపై ఎస్ఐ వాసు సిబ్బందితో దాడి చేశారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని రెండుపుంజులు, రూ.78,500 నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు.

రెస్టారెంట్ కుక్ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10 : ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న గుమ్మడి రెస్టారెంట్‌లో వంట మనిషిగా వచ్చిన నేపాల్ వాసి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేపాల్‌లోని గోరదా మండలం సీతాపూర్‌కు చెందిన థామన్ (25) రెండు నెలల క్రితం ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపలో ఉన్న గుమ్మడి రెస్టారెంట్‌లో వంటమనిషిగా చేరారు. అప్పటికే ఆ రెస్టారెంట్‌లో అతని సోదరుడు పాసన్ థామన్ (19) ఏడాదిన్నర నుంచి పని చేస్తున్నాడు. వీరిద్దరు అదే రెస్టారెంట్‌లో మొదటి అంతస్తులోని రూములో ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల తరువాత వారిద్దరు నిద్రించారు. శనివారం తెల్లవారి చూసేటప్పటికి ఆ రెస్టారెంట్‌లోని స్టోర్ రూమ్‌లో పది అడుగుల ఎత్తు ఉన్న కిటికీకి టవల్‌తో తామన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై రెస్టారెంట్ యజమాని ఏలూరు టూటౌన్ పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సాదిక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద స్థితిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై లైంగిక వేధింపులు.. ఫోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 10 : జంగా రెడ్డిగూడెం పట్టణంలో పదేళ్ళ బాలికను లైంగికంగా వేధించిన ఘనటపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడవ తరగతి చదువు తున్న బాలికకు అదే ప్రాంతంలో మెడికల్ షాపు నడుపుతున్న ఇబ్రహీం చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి లైంగికంగా వేదింపులకు పాల్పడ్డాడు. ఇదే విషయాన్ని బాలిక నానమ్మకు తెలియజేయడంతో ఆమె శనివారం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతి బాస్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు..కేసు నమోదు

టి.నరసాపురం,ఫిబ్రవరి 10 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ దుర్గా మహేశ్వర రావు తెలిపారు. అప్పలరాజు గూడెం పంచాయతీలోని పాకలగూడెం గ్రామ శివారు ఎర్రకాలువ తూర్పు వాగు వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో శనివారం తన సిబ్బందితో దాడి చేశారు. నిందితుడుని అదుపులోకి తీసుకుని ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో భక్తుని మృతి



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు గుండె పోటుతో మృతి చెందాడు. ఆకివీడుకు చెందిన కె.రాంబాబు (40) శనివారం ఉదయం ద్వారకాతిరుమల క్షేత్రానికి కుటుంబ సమేతంగా వచ్చాడు. మొక్కుబడుల అనంతరం స్వామిదర్శనం చేసుకుని స్థానిక అనివేటి మండపంలో సేదతీరాడు. ఇదే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. అతడిని సెక్యూరిటీ సిబ్బంది, కుటుంబసభ్యులు ద్వారకా తిరుమల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

ఆకివీడులో చోరీ

ఆకివీడు, ఫిబ్రవరి 10: హైదరాబాద్ వెళ్ళిన ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఆకివీడు రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉంటున్న ఎండీ జిలాని మోహిద్దీన్ భార్యతో కలిసి ఈ నెల 7న హైదరాబాద్ వెళ్ళారు. ఇంటి వెనుక కిటికీ ఊసలు వంచి ఉండడంతో 9వ తేదీన బంధువులు చూసి సమాచారం తెలిపారు. శనివారం మోహిద్దీన్ ఇంటికి వచ్చారు. 3 కాసుల బంగారం వస్తువులు దొంగిలించారని ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండవ లక్ష్మణరావు

బీసీ ద్రోహి జగన్మోహన్‌రెడ్డి

జయహో బీసీ సమావేశంలో నాయకుల విమర్శ

జంగారెడ్డి గూడెం టౌన్, ఫిబ్రవరి 10 : బీసీ కార్పొ రేషన్ లోన్లు, బీసీ సబ్సిడీ లోన్లు ఎత్తివేసిన జగన్మోహన్ రెడ్డికి బీసీలందరూ బుద్ధి చెప్పాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆలపాటి కల్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పాకనాటి అంజి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు భూసా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాజాన సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోరుముచ్చు గోపాల్ యాదవ్, దాసరి శ్యాంసుందర్ శేషు, రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ వ్యతిరేకి, బీసీ ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. 34 శాతం బీసీ రిజర్వేషన్లను 24శాతంకు తగ్గించి బీసీలను మోసం చేయడం దారుణమన్నారు. ఘంటా మురళీ, జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల రాజేష్, చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, చిత్రోజి తాతాజీ, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామకుమార్, మండవ లక్ష్మణరావు, ఎ.శ్రీనివాసరావు, బొబ్బర రాజ్‌పాల్, చేను ప్రసాద్ నంబూరి రామచంద్రరాజు, తూటికుంట దుర్గారావు, తెలగరపు జ్యోతి పగడం సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ ఉపసంహరించుకోవాలి : పీఆర్టీయూ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10:హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు రాష్ట్ర విద్య, శిక్షణ, పరిశోధనమండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 22 వరకు, 26 నుంచి మార్చి 6 వరకు రెండు విడతల్లో జిల్లాలోని నూజివీడు, ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో టీచ్ టూల్‌పై శిక్షణనిచ్చేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.అంజనేయులు ఓ ప్రకటనలో డిమాడ్ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇవ్వనున్న ఈ శిక్షణ వల్ల కీలకమైన సమయంలో టీచర్లు పాఠశాలల్లో అందుబాటులో లేకుండాపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతారని వివరించారు. పరీక్షల సమయంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులను బోధనేతర పనులకుకాకుండా, బోధనకు మాత్రమే వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.



జనసేనలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన బాలరాజు

జనసేనలో చేరిన 60 కుటుంబాలు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 10 : మండలంలోని గుళ్ళపూడి గ్రామానికి చెందిన 60 కుటుంబాలకు చెందినవారు శనివారం రాత్రి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ చిర్రి బాలరాజు సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేన పార్టీ అధినేత పవన్ సిద్ధాంతాలు నచ్చడంతో పార్టీలో చేరినట్లు పలువురు తెలిపారు. అభివృద్ధి జరగాలంటే జనసేన, టీడీపీ అధికారంలోకి రావడం అవసరమని, వైసీపీ ఎమ్మెల్యే సమస్యలను పట్టించుకోవడంలేదని బాలరాజు తెలిపారు. గ్రామస్థులు కోరినట్లు అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి రోడ్డును వేస్తామన్నారు. నాయకులు మెట్ట బుచ్చిరాజు, గుండుమోగుల సత్యనారాయణ, సూరిబాబు, మడకం రాజేష్, మడకం అనిల్, పూనెం మంగరాజు, పూసం బాబురావు, కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ, వనిత క్లబ్‌ల కార్యవర్గం ఎంపిక

టి.నరసాపురం, ఫిబ్రవరి 10 : బొర్రంపాలెంలో వాసవీ, వాసవీ వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గం ఎంపిక గవర్నర్ కంచెర్ల మోహన్‌రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా ఇమ్మడి శ్రీకాంత్, కార్యదర్శి జూలూరి కిరణ్, కోశాధికారి బచ్చు గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలుగా కొనకళ్ళ మౌనిక, కార్యదర్శి జూలూరి గీత, కోశాధికారి కంభంపాటి వాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోడి కత్తి శ్రీనును బలి చేశారు : దాసరి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 10: గత ఎన్నికల్లో కోడికత్తి శ్రీనును, జగన్ బాబాయి హత్యను రాజకీయంగా వాడుకుని లబ్ధిపొంది శ్రీను జీవితాన్ని సీఎ జగన్ బలి చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు ఆరోపించారు. దాసరి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పకుండా ఆ కుటుంబాన్ని తీవ్ర మనోవేదనకు గురి చేశాడన్నారు. టీడీపీతో పాటు వామపక్షాల దళిత, ప్రజాసంఘాల సహకారంతో శ్రీనుకు బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

హెచ్‌ఐవీ, టీబీ బాధితులకు పౌష్టికాహారం

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 10:హెచ్ఐవీ, టీబీ వ్యాధి బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. ఆర్‌బీఎస్‌కే సెంటర్‌లో శనివారం హెచ్ఐవీ, టీబీ వ్యాధి బాధితులకు పౌష్టికాహారం అందజేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పఠాన్ హూస్సేన్ ఖాన్, అందే మహంకాళి జ్ఞాపకార్థం వారి వారసులు షేక్ షబీరున్నీస, ఎ.సుచరిత, పౌష్టికాహారాన్ని సరఫరా చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ వర్మ, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజీ వైద్యశిబిరం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10: ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్, ఏలూరు స్మార్ట్ ప్రొఫెషనల్ లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లోని జింగిల్‌బెల్ పాఠశాలలో శనివారం గైనకాలజీ వైద్యశిబిరం నిర్వహించారు. ఏలూరు జననీ ఆసుపత్రి వైద్యులు ఎం.డి. షాజియా సుల్తానా పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతినెల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సురేష్‌కుమార్, మల్లికార్జునరావు, కృష్ణమోహన్, పాఠశాల సంచాలకులు సురేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పర్యవేక్షించారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



మాట్లాడుతున్న మోహనకృష్ణారెడ్డి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 10: రైతులు పండించే పంట లకు విచ్చలవిడిగా రసాయన మందులు వాడకుండా సేంద్రి య ఎరువులను వినియోగించా లని ఐపీఎఫ్‌టీ డైరెక్టర్ ఎం.మో హనకృష్ణారెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో పురుగు మందుల సూత్రీకరణ, సాంకేతిక సంస్థ గురుగ్రామ్ ఆధ్వర్యంలో ఏపీ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ సహకారంతో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. పురుగు మందుల సురక్షితమైన, వివేకవంతమైన ఉపయోగం, కూరగాయల పంటల రక్షణపై వివరించారు. పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు, ఏపీ ఎస్‌జీడీసీఎఫ్ చైర్మన్ ప్రకాశ్‌యాదవ్, గొర్రెల పెంపకందారుల యూనియన్ అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి

పెదవేగి, ఫిబ్రవరి 10 :ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి పీహెచ్‌సీలో నిర్మించిన లాబొరేటరీని పెదవేగి ఎంపీపీ తాతా రమ్యతో కలిసి ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. దెందులూరు జడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం, పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

- పెదపాడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందజేసేందుకు కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. సత్యవోలు గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రను శనివారం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



బీజేపీ ప్రచార కార్యక్రమంలో భాగంగా కామవరపుకోట మండలం జీలకర్రగూడెంలో జబర్దస్త్ కళాకారులు, గేయ రచయిత అనంత శ్రీరామ్‌ను కిసాన్ మోర్చ నాయకులు సీతారామరాజు(చినరాజు) అభినందించారు.







ఏపూరులో కరపత్రాన్ని అందజేస్తున్న చింతమనేని, యర్రగుంటపల్లిలో టీడీపీలో నేతలు , రామచంద్రపురంలో గన్ని వీరాంజనేయులు

లోకేశ్ శంఖారావం విజయవంతం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

భీమడోలు, ఫిబ్రవరి 10 : సీఎం జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమంతో పర్యటించి వైసీపీ ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు వివరిస్తారన్నారు. 40 నుంచి 50 రోజుల్లో 120 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటిస్తారన్నారు. శిరిబత్తిన కొండబాబు, పెద్దిరాజు, పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

- పెదపాడు : జగన్‌రెడ్డి రాక్షస పాలనపై నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. ఏపూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆరు పథకాలపై ప్రజలకు వివరిస్తూ చింతమనేని పాదయాత్రగా ముందుకు కదిలారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కామవరపుకోట : సీఎం జగన్, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న శంఖారావాన్ని విజయవంతం చేయాలని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి సునాయాసంగా విజయం సాధిస్తుందన్నారు. టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా శంఖారావం పాల్గొనాలన్నారు.
- జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 10 : వైసీపీ అరాచక పాలనపై లోకేశ్ పూరిస్తున్న సమరనాదమే శంఖారావం అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన శ్రీనివాసపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 120 నియోజకవర్గాల పరిధిలో శంఖారావం ద్వారా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి, ప్రభుత్వ అరాచక విధాలను ప్రజలకు వివరిస్తారన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ, రైతు మండల అధ్యక్షుడు యెలికే ప్రసాద్, కేదాసు అర్జునరావు, రాగాని రామకృష్ణ, రాగాని శ్రీనివాస్, దంసెల్లి ఆంజనేయులు, పులపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- యర్రగుంటపల్లిలో 50 మంది టీడీపీలో చేరిక

చింతలపూడి : యర్రగుంటపల్లి గ్రామంలో హరిజనవాడలకు చెందిన 50 మంది తెలుగుదేశం పార్టీలో శనివారం చేరారు. వీరిని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వైసీపీ అరాచకాలకు వ్యతిరేకంగా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామంలో ప్రభుత్వ చర్యలకు విసిగి వేసారి 50 మంది పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు కోండ్రు దేవ, పక్కాల వెంకటేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు, రాజశేఖరరెడ్డి, ఆది జగన్, రాధారాని, శాంతారెడ్డి, టి.భాస్కర్, టి.చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్, అప్పిరెడ్డి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో 'మన ఇంటికి మన గన్ని'

ఉంగుటూరు, ఫిబ్రవరి 10 : తెలుగుదేశం-జనసేన కూటమి పార్టీల ఆధ్వర్యంలో రాబోయే ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేస్తామని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. శనివారం రామచంద్రపురం గ్రామంలో 'మన ఇంటికి మన గన్ని' కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఉంగుటూరు సర్పంచ్ బండారు సింధు, శింగులూరి రామకృష్ణ, నల్లా ఆనంద్, నూకారి ఆశీర్వాదం, పొన్నం ప్రసాద్, మద్దిపాటి వెంకటేశ్వరరావు, అక్కిన నాగమణి, సునీత, శ్యామల పాల్గొన్నారు.

పాపయ్యపాలెంలో 'భవిష్యత్ గ్యారెంటీ'

కామవరపుకోట, ఫిబ్రవరి 10 : తడికలపూడి పంచాయతీ 14వ వార్డు పాపయ్యపాలెం గ్రామంలో శనివారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ శ్రేణులు బొంతు వెంకటేశ్వరరావు, తూతా లక్ష్మణరావు, మేరుగు సుందరరావు, మొట్టికాయల నాగేశ్వరరావు, బోట్ల రాజు, మట్టి వెంకటేశ్వరరావు, మెరుగు రాంబాబు, రొంటపల్లి నాగేశ్వరరావు, బోట్ల రామకృష్ణ, బోట్ల నాగరాజు, కోటేశ్వరరావు, పెద్దింట్లు బృందం ఇంటింటికీ వెళ్ళి చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ సంతకాలుచేసిన సూపర్-6 పథకాల హామీ బ్రోచర్లను, పత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధిస్తే ఒక్కో కుటుంబానికి వచ్చే లబ్ధిని వివరించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి పరిపాలించే హక్కులేదు



సమావేశంలో మాట్లాడుతున్న మేఘలాదేవి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వానికి పరిపాలించే హక్కులేదని తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి విమర్శించారు. శనివారం ఆమె ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుత పోరాటం చేస్తుంటే వారిని అధికార బలంతో అణిచివేయడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లో ఉన్నాయని తెలిపారు. మహిళా నాయకులు రమా, ఝాన్సీ, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది ప్రచార ఆర్భాటమే : టీడీపీ నాయకులు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్పితే అభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకులు అన్నారు. లునాని నగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి అంటే శిలాఫలకాలు ఆవిష్కరించడం కాదన్నారు. నాలుగేళ్ల ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ నాని ఇబ్బడిముబ్బడిగా శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ఐదేళ్లలో రోడ్లపై అడుగుకో గుంతల్లా కనపడుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి హయాంలో ఏలూరు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో, వైసీపీ ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, నగర అధ్యక్షుడు పెద్దిబోయి న శివప్రసాద్, కార్పొరేటర్లు తంగిరాల అరుణసురేష్, వందనాల దుర్గాభవాని, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, బొరోతు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



అస్తవ్యస్తమైన రహదారులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఆర్టీసీ కార్మికుల రక్తదానం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు రీజనల్ మేనేజరు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్.వి.ఆర్ వరప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి మూడునెలలకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సుమారు 100 మందికిపైగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ మెడికల్ అధికారి ఆర్.ఎస్.ఆర్.కె వరప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎంతోమందికి ప్రాణాపాయ స్థితినుంచి కాపాడవచ్చన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు డిపో మేనేజరు డి.వాణి, నూజివీడు డిపో మేనేజరు సీహెచ్ పవన్‌కుమార్, ఏఎంపీ బి.మురళీ, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ ఐ.ప్రేమ్‌కుమార్, రెడ్‌క్రాస్ పీఆర్వో కేవీ రమణ, మెడికల్ అధికారి టి.భాను, ఆర్టీసీ పీఆర్వో కె.ఎల్.వి నరసింహం తదితరులు పాల్గొన్నారు.



రక్తందానం చేసిన వారికి ఫ్రూటీ అందజేస్తున్న ఆర్ఎం

చిన్ననాటి నుంచే చదువుపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10:బాలికలు చిన్ననాటినుంచే చదువు పట్ల శ్రద్ధ వహించి తల్లిదండ్రులు, గురువులను గౌరవించి ఒక నిర్దేశితమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానికంగా శనివారం చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి, బాల పంచాయతీ, బాలల సంబం ధిత కమిటీ సభ్యుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాలబాలికలు సెల్‌ఫోన్ వినియోగం వల్ల చెడువ్యసనాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇన్‌చార్జి, ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడారు. చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, యాపిల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎ.శివకృష్ణ, క్రాఫ్ కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, పి.సుమాంజలి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10: పౌష్టికాహారం, శారీరకశ్రమ కలిగి ఉంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కృష్ణ అన్నారు. ఆర్.ఆర్‌పేటలోని శ్రీకృష్ణ ఆర్థోహాస్పిటల్లో ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతినెల రెండో శనివారం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. వీటితో పాటు ఎక్స్‌రే, బోన్‌మ్యారో, రక్తపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. సుమారు 300మందికిపైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీఆర్వో నాగేశ్వరరావు, మేనేజరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో జ్ఞాపకశక్తి పెంపు

పెదవేగి, ఫిబ్రవరి 10 : ఆటపాటలతో కూడిన బోధనతో చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పెదవేగి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి అన్నారు. శనివారం లక్ష్మీపురంలో అంగన్‌వాడీ విద్య-ఆటపాటల కార్యక్రమంలో భాగంగా రంగుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. పచ్చని రంగు కలిగిన పలు రకాల వస్తువులు, దుస్తులు, ఆకులు వంటివాటిని పిల్లలతో చెప్పించి, రంగుల ఆవశ్యకతను కార్యకర్తలు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషారాణి, తులసి, సహాయకురాలు మస్తాన్ బీ పాల్గొన్నారు.

టీడీపీ నేత సాంబశివరెడ్డికి ఘన నివాళి

చింతలపూడి, ఫిబ్రవరి 10 : యర్రగుంటపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు దివంగత టి.సాంబశివరెడ్డి పదో వర్ధంతి కార్యక్రమం శివారం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి సాంబశివరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా పార్టీకి ఆయన ఎనలేని సేవలు అందించారన్నారు. మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి, శాంతారెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, విజయభాస్కర్, వై.వి.సత్యనారాయణ, జగన్, అప్పిరెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పలువురి పరామర్శ

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 10: టీడీపీ నాయకుడు నార్ని శ్రీనివాస్‌ను జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు, టీడీపీ నేత గొడవర్తి విద్యాసాగర్ శనివారం పరామర్శించారు. ఇటీవల యర్రంపేటలో శ్రీనివాస్ తండ్రి నార్ని లక్ష్మణరావు మృతి చెందడంతో నాయకులు శ్రీనివాస్‌ను పరామర్శించారు. టీడీపీకి లక్ష్మణరావు ఎన్నో సేవలందించారని కొనియాడారు. పరామర్శించిన వారిలో జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, ఉపాధ్యక్షుడు ఉమా, జనసేన నాయకులు దుగ్గిన శ్రీను, కొయ్యలగూడెం పట్టణ జనసేన అధ్యక్షుడు శ్రీను, బొలిశెట్టి శ్రీను, కామిశెట్టి సత్తిబాబు, తేజ పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : గారపాటి



కుక్కునూరులో బీజేపీ జెండా అవిష్కరిస్తున్న తపన చౌదరి

కుక్కునూరు, ఫిబ్రవరి 10 : కేంద్రం, రాష్ట్రంలలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. శనివారం సీతారామనగరం నుంచి కుక్కునూరు మండలంలో పలు గ్రావలోట్ల 'పల్లెకి పోదాం' కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. గ్రామాల్లో పర్యటిస్తూ బీజేపీ అమ లు చేస్తున్న పథకాలు వివరించారు. దాచారం పంచాయతీలోని బెస్తగూడెం గ్రామంలో పొక్కుల నాగేశ్వరరావు ఇంట్లో పల్లె నిద్ర ఉంటుందని మండల అధ్యక్షుడు తూము వెంకన్న తెలిపారు. పల్లె నిద్ర ఇన్‌చార్జి మొడియం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెలకం బాలకృష్ణ, ఎం. రాము, ఉపాధ్యక్షుడు కృష్ణార్జునరావు, చేరువుకట్ల సతీష్, కుంజా వెంకటనరసయ్య, వీరాచారి పాల్గొన్నారు.

- దెందులూరు : బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని చల్లచింతలపూడి, పాతకమ్మవారిగూడెం, కొత్తకమ్మవారి గూడెం, పెరుగుగూడెం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మండూరి బుజ్జిగోపాల్ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ రాష్ట్ర మోర్చ నాయకులు పింగుల నాగరామ్మోహన్‌రావు, గుంపుల బాబూరావు, చీకట్లు ప్రభుచౌదరి, వేల్పూరి వాసుదేవరావు, పిన్నిమోయిన రమేష్, ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం : మండలంలోని తెల్లంవారిగూడెం, జైనవారిగూడెం గిరిజన గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ దేశానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నరేంద్ర ప్రకాశ్, బొల్లిన నిర్మలా కిషోర్, కట్టా సత్యనారాయణ, దొమ్మేటి లక్ష్మీజనార్దనరావు, వంకా కాంచనమాల, సోము హరినారాయణ, పావిల వీరకృష్ణ, కొండేపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం తహసీల్దార్ సుమతికి ఘన సన్మానం

పోలవరం, ఫిబ్రవరి 10:పోలవరం తహసీల్దార్ బి.సుమతి సమర్థవంతంగా విధులు నిర్వర్తించి, అందరి మన్ననలు పొందారని ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. పోలవరం నుంచి ఇటీవల బదిలీ కావడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది సన్మాన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐతో పాటు మీడియా ప్రతినిధులు సొబ్బన రాజశేఖర్, జయవరపు ఆదిశేషు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం తహసీల్దార్ దంపతులకు పట్టువస్త్రాలు, చీర సారెలతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కాజా రమేశ్, వీఆర్వోలు దత్తు, వెంకటేశ్వరరావు, గాంధీ, వీఆర్ఏలు చిన్నా, దేవి, పద్మ సిబ్బంది, మేరీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

శుభోదయం పార్కులో ఉచిత వైద్యశిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : స్థానిక కామినేని హాస్పిటల్స్ రెడ్‌క్రాస్ సొసైటీ, వాల్ ఆఫ్ కైండ్‌నెస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్ శుభోదయం పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వైద్యసలహాలను అందించారు. కామినేని హాస్పిటల్స్ వైద్యనిపుణుడు కొడాలి రామ్ ప్రసీన్, గైనకాలజిస్టు నిర్మలాదేవి, రేడియాలజిస్టు ప్రసాదరావు మాట్లాడుతూ క్రమంతప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, మంచి నిద్ర ప్రతీఒక్కరూ అనుసరిస్తే రోగాలు ధరిచేరే అవకాశాలు తక్కువగా ఉంటాయని సూచించారు. పార్కు అభివృద్ధి కమిటీ నాయకులు చౌదరి, ఉమామహేశ్వరరావు, సూరిబాబు, పట్నాయక్, రఘుబాబు, శివరావు, నిర్మలకుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠామూర్తులకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 10 : రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహిస్తామని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. సంబంధిత పూజా కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి హోమంతో విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, అధివాసాంగ హోమాలు, నవగ్రహ హోమాలు, నక్షత్ర హోమం, దేవతాహోమాలు జరిపారు. అనంతరం ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయనాధివాస పూజలు నిర్వహించారు.



రాట్నాలగుంట ఆలయంలో క్షీరాధివాసంలో పాల్గొన్న భక్తులు

16న గ్రామీణ బంద్ జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 10 :రైతాంగ, కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్, ఏపీ గిరిజన సంఘం, సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం రామనర్సయ్య భవనంలో టి.బాబూరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వామపక్షాల నాయకులు కారం రాఘవ, మొడియం నాగమణి, ఎస్.రామ్మోహన్, తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బంద్‌లో కార్మిక లోకం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బి.వినోద్, బి.శ్యాంబాబు, జి.పండు, కె.సర్వరాజు, కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మైసన్నగూడెం రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 10: మైసన్నగూడెం రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాది కాలం కావస్తున్న ఇప్పటివరకు నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైందన్నారు. పి.చంటి, కే.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో క్రీడోత్సవాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10:సిద్ధార్థ విద్యాసంస్థల వార్షిక క్రీడోత్సవాలు శనివారం జరిగాయి. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఎంత ఆస్తివున్నా ఆరోగ్యంలేకపోతే శూన్యమేనన్నారు. డైటీషియన్ అనూరాధ మాట్లాడుతూ చెప్పులు లేకుండా మట్టినేలపై నడవడంవల్ల ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ప్రిన్సిపాల్ పి.ఎస్.ఆర్.కుమార్, కరస్పాండెంట్ కోనేరు సురేష్‌బాబు పాల్గొన్నారు. బాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం : ఇన్‌చార్జి ఏడీఈ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 10:విద్యుత్ లో-ఓల్టేజీ సమస్యలు పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఏడీఈ సుబ్బారావు తెలిపారు. శనివారం విద్యుత్ లో-ఓల్టేజి సమస్యలు పరిష్కరించేందుకు జీలుగుమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. పి.అంకంపాలెం రైతులు అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. చీమలవారిగూడెం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా వ్యవసాయ బోర్లకు అందజేయాల న్నారు. రామన్నపాలెం, దాట్లవారిగూడెంలో లోవోల్టేజి సమస్య పరిష్కరిం చాలని వినియోగదారులు అధికారులను కోరారు. జేఈ హరిబాబు, ఎల్ఐ కన్నయ్య, లైన్‌మెన్‌లు వెంకటరత్నం, వెంకటేశ్వరావు, జగన్, రాము, రాంబాబు ఉన్నారు.

118 మందికి ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 10 :స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబింలో శనివారం ఆయుర్వేద డాక్టర్ బి.వి.ఎం.నగేష్ 118 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సలహాలు, సూచనలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు, స్థానిక ప్రతినిధులు బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్నా వెంకట్రామయ్య, సత్యనారాయణ, బచ్చు విష్ణు, కోరుకొండ ప్రసాద్, మద్దుల రవి బృందం సేవలు అందించారు.

'ప్రజావ్యతిరేక విధానాల్లో ప్రభుత్వాలు'

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 10 :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాశ్ తెలిపారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు, గిరిజనులు ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ భూములను కార్పొరేట్లకు దారదత్తం చేసే ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టాన్ని వ్యతిరేకించాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్.బాలసుందరం, ఎస్.రాజశేఖర్, కె.సుందరావు, పి.పార్వతి, ముక్కమ్మ, దుర్గమ్మ, భూలక్ష్మి, బేబి, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- ఉంగుటూరు, ఫిబ్రవరి 10 : జాతీయ రహదారి పక్కన నారాయణపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ 11వ కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 14 జంటలు పీటలపై కూర్చుని పూజలు చేశారు.
- ఏలూరు ఎడ్యుకేషన్ : 'సుఖ ప్రసవాలు, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన బిడ్డలు' అనే అంశాలపై శనివారం స్థానిక కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు.
- ఏలూరుటూటౌన్ : మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్‌లకు భారతప్రభుత్వం భారతరత్న అవార్డులు ప్రకటించటం పట్ల ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.
- ఏలూరు కార్పొరేషన్ : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో 102 మంది సువాసినీలతో లక్ష పసుపు కొమ్ములతో శ్రీవాసవీ సహస్ర నామావళి పూజను నిర్వహిస్తున్నట్టు ఆరాధనోత్సవ కమిటీ సభ్యులు తెలిపరు.
- ఏలూరుకార్పొరేషన్ : స్థానిక పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జనసేన శ్రేణుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.


చెక్కపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న ముద్దరబోయిన


అటపాకలో భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాల పంపిణీ


శింగనపూడిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

పేదలకు వరం సూపర్ సిక్స్ పథకాలు

▸▸చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి ▸▸జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలి ▸▸బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వక్తలు

కైకలూరు, ఫిబ్రవరి 10: సూపర్ సిక్స్ పథకాలు పేదల పాలిట వరమని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. శనివారం కైకలూరు మండలం అటపాకలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల హామీపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే పేదలకు ఆరు పథకాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, గ్రామ నాయకులు వేల్పూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి: కమ్మిలి విఠల్

మండవల్లి: రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పిలుపునిచ్చారు. శింగనపూడిలో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళుతూ టీడీపీ హామీ పత్రాలను ప్రజలకు అందిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. వైసీపీలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలని కోరారు. టీడీపీ నాయకుడు కొడాలి వినోద్, పళ్లెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పేరుతో మోసం : ముద్దరబోయిన

ముసునూరు, ఫిబ్రవరి 10: జగనన్న కాలనీల పేరుతో పేదలను జగన్‌రెడ్డి మోసం చేస్తున్నాడని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చెక్కపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న లక్షా 50 వేలు మాత్రమే ఇస్తున్న జగన్‌రెడ్డి సంబంధిత కాలనీలకు తన పేరు ఎలా పెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఇచ్చిన నిధులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసేదని, ఇప్పుడు మాత్రం పనికిరాని కొండభూములు, చెరువు భూములు, వాగు పోరంబోకు భూములను ఇళ్లస్థలాలకు కేటాయించి, వాటినీ అధికార పార్టీ సానుభూతిపరులకే పంపిణీ చేస్తున్నారన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో టీడీపీ 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక 10 శాతానికి తగ్గించేసిందని ఫలితంగా 16 వేల పదవులు బీసీలు కోల్పోయారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకం ద్వారా రాయితీలపై పరికరాలు, రుణాలు ఇస్తే, జగన్‌రెడ్డి బీసీలకు 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నిధులు ఇవ్వకుండా ఛైర్మన్‌లకు కనీసం కుర్చీ కూడా లేకుండా అవమానించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ టి. రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ కె. పుష్పావతి శ్రీనివాసరావు, దేవినేని ఢలరాం, నూతక్కి వేణుగోపాలరావు, కందుల పిచ్చియ్య, కాటేపల్లి ప్రసాద్, చిలుకూరి వెంకటేశ్వరావు, మామిడిశెట్టి గిరిబాబు, కాటేపల్లి నాగేశ్వరావు, మానురాజు సురేష్, కాటేపల్లి సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, ఫిబ్రవరి 10: మండలంలోని తుమ్మగూడెం, సోమవరం సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో పెద్ద లైన్‌లు మరమ్మత్తుల నిమిత్తం 11వతేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 3ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహరించాలని ఏఈ కోరారు.

నేడు చాట్రాయిలో ప్రజాసభ



చాట్రాయి, ఫిబ్రవరి 10: నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఆధ్వర్యంలో చాట్రాయిలో 11వ తేదీన జరగనున్న ప్రజాసభకు భారీ ఏర్పాట్లు చేశారు. చాట్రాయి-పోలవరం రోడ్డులో ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలోని వ్యవసాయ భూమిలో వేదిక నిర్మించారు. సుమారు 10 వేల మంది సభకు హాజరవుతారని అంచనా.

రేపు టిడ్కో ఇళ్లపై జనసేన దీక్ష

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: టిడ్కో ఇళ్లపై ఎమ్మెల్యే అసత్య హామీలు నిరసిస్తూ జీ+3 ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సోమవారం నిరాహార దీక్ష చేయనున్నట్లు జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తయిన ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించటంలో వైసీపీ పూర్తిగా విఫలమైందన్నారు. దీనిపై ఈ నెల 12న మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షను జయప్రదం చేసేందుకు టిడ్కో జీ+3 లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు. పార్టీ నూజివీడు పట్టణ నాయకుడు ముత్యాల కామేష్ మాట్లాడుతూ పేదల కోసం ప్రధాని నరేంద్రమోదీ పీఎంఏవై పథకాన్ని తీసుకు వచ్చారని దానికి శంకుస్థాపన సమయంలోనే అడ్డుపడి ఇప్పుడు పంపిణీ కాకుండా ఎమ్మెల్యే జాప్యం చేయిస్తున్నారన్నారు. జనసేన నాయకులు బండారు రాజు, ముమ్మలనేని సునీల్‌కుమార్, వీర మహిళా నాయకురాలు రంగు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిషరీస్ ఏడీపై విచారణ

కలిదిండి, ఫిబ్రవరి 10: చేపలు, రొయ్యల చెర్వులకు అనుమతుల మంజూరులో ఫిషరీస్ ఏడీ చాంద్ బాషా జాప్యం చేస్తున్నారని ఆక్వా రైతులు ఫిర్యాదు చేయడంతో శనివారం పెదలంకలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు ఆక్వా రైతులను విచారించారు. అనుమతులు మంజూరుకు దరఖాస్తు చేసుకుని ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం క్షేత్రస్థాయిలో చెరువు వద్దకు వచ్చి పరిశీలించడం లేదని, డబ్బులు ఇచ్చినవారికే ముందుగా అనుమతులు ఇస్తున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారికి పలువురు రైతులు తెలిపారు. త్వరితగతిన చెరువులకు అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మీడియాకు సమాచారం లేకుండా జిల్లా మత్స్యశాఖ అధికారి ఈ విచారణ చేపట్టారు. ఈ నెల 8న కైకలూరులో ఆర్డీవో ఖాజా వలీ ఈ విషయంపై నాలుగు మండలాల ఆక్వా రైతులను విచారించారు. మరలా ఇప్పుడు జిల్లా మత్స్యశాఖాధికారి విచారణ చేయడం చర్చనీయాంశమైంది.

టీచర్లకు శిక్షణ ఉపసంహరించాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10:హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలకు రాష్ట్ర విద్య, శిక్షణ, పరిశోధనమండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 22 వరకు, 26 నుంచి మార్చి 6 వరకు రెండు విడతల్లో జిల్లాలోని నూజివీడు, ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో టీచ్ టూల్‌పై శిక్షణనిచ్చేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఓ ప్రకటనలో డిమాడ్ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇవ్వనున్న ఈ శిక్షణ వల్ల కీలకమైన సమయంలో టీచర్లు పాఠశాలల్లో అందుబా టులో లేకుండాపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతారని వివరించారు. పరీక్షల సమయంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను బోధనేతర పనులకుకాకుండా, బోధనకు మాత్రమే వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికుల రక్తదానం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు రీజనల్ మేనేజరు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎస్.వి.ఆర్ వరప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి మూడునెలలకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి రక్తదానం చేయ వచ్చని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సుమారు 100 మందికిపైగా రక్తదానం చేశారు.


మాట్లాడుతున్న కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్

అగ్నికుల క్షత్రియుల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

కలిదిండి, ఫిబ్రవరి 10 : అగ్నికుల క్షత్రియుల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శనివారం మట్టగుంట, పెదపుట్లపూడి, దుంపలకోడు దిబ్బ, సున్నంపూడి, చిన్నతాడినాడ, పల్లిపాలెం గ్రామాల్లో పర్యటించి అగ్నికుల క్షత్రియుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు 50 ఏళ్లకే పెన్షన్ అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. చేపల వలలు, బోట్లు, వాహనాలు పంపిణీ చేసిందన్నారు. ఉప్పుటేరు వెంబడి గ్రామాల్లో నివశించే అగ్నికుల క్షత్రియుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అగ్నికుల క్షత్రియుల, మత్స్యకారులు ఐక్యంగా టీడీపీ గెలుపుకు సహకరించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, నాయకులు పొన్నాల నాగబాబు, తిరుమాని శశిదేవి, సొర్రా అరవింద్, సంగా బాబూరావు, పెద్ది రాజు, కొల్లాటి మార్రాజు, వాతాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీ అరాచకాలపై లోకేశ్ శంఖారావం

కైకలూరు, ఫిబ్రవరి 10: వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించేందుకు, రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టే శంఖారావం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరు పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో లోకేశ్ ప్రచారానికి శ్రీకారం చుట్టారని ఇందులో భాగంగానే ఆదివారం పలాసలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. 40 నుంచి 50 రోజులపాటు 120 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటిస్తారన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, తెలుగు యువత నాయకులు పడమటి వాసు, రాయనూతల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల చించివేతపై జనసేన ఫిర్యాదు



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: జనసేన బ్యానర్ల ధ్వంసంపై జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రావిచర్ల అడ్డరోడ్డు వద్ద జనసేన ఫ్లెక్సీలను ఆగంతుకులు ఈ నెల 8వ తేదీ రాత్రి చించివేశారని, సీసీ కెమెరాలను పరిశీలించి దోషులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనసేన నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్, ధనలక్ష్మి, షేక్ నాగూర్, తోట బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముసునూరు, ఫిబ్రవరి 10: మండలంలోని రమణక్కపేట, సూరేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలికుమారి, ఎస్‌ఐ పి.వాసు శనివారం పరిశీలించారు. రమణక్కపేట, సూరేపల్లిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను వారు పరిశీలించారు. నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని బీఎల్‌వోలను ఎంపీడీవో ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఈ గ్రామాల్లో శాంతిభద్రతలపై ఎస్‌ఐ స్థానికుల నుండి సమాచారం సేకరించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, యోహాను తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు, ఫిబ్రవరి 10: అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. శనివారం భుజబలపట్నంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఫోన్లలో వచ్చే ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు షేర్ చేయవద్దని, అలా చేస్తే బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము గల్లంతవుతుందన్నారు. అలాగే ఫోన్లను ఇతరులకు ఇచ్చేటప్పుడు కూడా ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణ పనులు వేగవంతం చేస్తాం: డీఈఈ



మండవల్లి, ఫిబ్రవరి 10: మండవల్లిలో రహదారి విస్తరణ పనులను వేగవంతం చేస్తామని నేషనల్ హైవే డీఈఈ సత్యనారాయణ తెలిపారు. మండ వల్లిలో నిర్మాణం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు నిర్మాణ పనులు నిలుపుదల వల్ల తలెత్తుతున్న సమస్యలను డీఈఈ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ మండవల్లిలో ఆగిన పనులు తిరిగి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండవల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించినట్లు సత్యనారాయణ తెలిపారు. డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా సహకరించాలని వారు కోరారు. అంబేద్కర్ విగ్రహాన్ని మరోచోటకు మార్చాలని సంఘ అధ్యక్షుడు శాంతరాజును కోరారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : ఎంఈవో



ముసునూరు, ఫిబ్రవరి 10: టెన్త్ విద్యార్థులు కష్టపడి చదివి మంచి గ్రేడ్ మార్కులు సాధిం చాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. శనివారం ముసునూరు భారతీయ విద్యానికేతన్‌లో జరిగి న ఫేర్‌వెల్ పార్టీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని అలరించాయి. ప్రిన్సిపల్ కె.శౌరి, కరస్పాండెంట్ కె.విజయ్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


పి. శ్రీనివాసరావు (ఫైల్)

ముసునూరు, ఫిబ్రవరి 10: ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గోగులంపాడులో శనివారం జరిగింది. ఎస్సై పి.వాసు వివరాల ప్రకారం ఆటో నడుపుతూ జీవనం సాగించే పాలవెల్లి శ్రీనివాసరావు (37) కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆటో నడపలేక పోతున్నాడు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు పెనుభారం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై వాసు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



కైకలూరు, ఫిబ్రవరి 10: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై రూ.1.5 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి వరహాపట్నం శివారు అగ్రహారంలో పడమటి శివరామకృష్ణకు రేకుల ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. శివరామకృష్ణ తన కుటుంబీకులతో రొయ్యల చెరువుపై కాపలా కాసేందుకు వెళ్లగా అర్ధరాత్రి సమయంలో మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల ప్రజలు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కైకలూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికే ఇంటిలోని గృహోపకరణాలతో పాటు గ్యాస్ సిలిండర్, బ్యాంకు పాసుపుస్తకాలు, బాండ్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు పూర్తిగా నిరాశ్రయులయ్యారు.



తెలంగాణ మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: తెలంగాణ మద్యం అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఇద్దరు నిందితులను నూజివీడు సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ వివరాల ప్రకారం నూజివీడు మండలం సిద్ధార్థనగర్ తండాలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళుతున్న పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన దేవనబోయిన సురేష్, ఉంగుటూరు మండలం వేంపాడుకు చెందిన కొలుసు శివబ్రహ్మంలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 44 తెలంగాణ మద్యం సీసాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

ముసునూరు, ఫిబ్రవరి 10: గోగులంపాడులో శనివారం కోడిపందేల శిబిరంపై ఎస్‌ఐ వాసు సిబ్బందితో కలసి మెరుపు దాడి చేశారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు పుంజులు, రూ.78,500 నగదు, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కోడిపందేలు, ఇతర జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


జబర్దస్త్ టీం హాస్య సన్నివేశం(ఇన్‌సెట్) గేయరచయిత శ్రీరామ్ గీతాలాపన

ఆటపాటలతో జబర్దస్త్ టీం సందడి

మండవల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకులు ఆటపాటలు హాస్య సన్నివేశాలతో కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలతో శనివారం ప్రచారం చేశారు. చింతపాడు, లోకుముడి, భైరవపట్నం, పెరికేగూడెం, జబర్దస్త్ కళాబృందం ప్రచారం నిర్వహించారు. మోడీ నేతృత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి, గత 16 సంవత్సరాలుగా తపనా ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత చింతపాడు గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబి, వినోద్(వినోదిని), ఇమ్మాన్యుయేల్ హాస్య భరిత ప్రదర్శనలు ద్వారా స్థానికులను అలరించారు. సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్‌కౌండిన్యలు సినీ గీతాలతో ఉర్రూతలూగించారు. గేయ రచయిత శ్రీరామ్ పాడిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, మండల అధ్యక్షులు ఎస్. ఏసుబాబు, సైదా ఆనంద్‌బాబు, ఘంటసాల పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

లఘు శ్యామలగా శ్రీశ్యామలాంబ



కైకలూరు, ఫిబ్రవరి 10: శ్యామలా నవరాత్రుల సందర్భంగా శనివారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు లఘు శ్యామలగా భక్తులకు దర్శనమిచ్చారు. సమ్మెట సాంబశివరావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ గుర్రం రాంబాబు, ఈవో శేఖర్ ఏర్పాట్లను నిర్వహించారు.

రోడ్లపైకే మురుగునీరు

పట్టించుకోని అధికారులు



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో పక్కా రహదారులు సైతం బురదమయంగా మారుతున్నాయి. దిగవల్లి తూర్పు దళితవాడలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలో వాడిన నీరు నేరుగా రహదారి పైకి వచ్చి నిలిచిపోతోందని, గతంలో తవ్విన కచ్చా డ్రైన్లు పూడిపోవడంతో కనీసం వాటినైనా పునరుద్ధరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మురుగునీరు నిలిచిన రహదారులపై చిన్నపిల్లలు, వయోవృద్ధులు జారిపడి గాయాలపాలవుతున్నారని మరోవైపు దోమలు విజృంభిస్తుండటంతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని దిగవల్లి గ్రామస్థులు, నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు వాపోతున్నారు. అధికారులు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఆగిరిపల్లిలో 'పల్లెకు పోదాం'



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 10: కేంద్రం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభు త్వం తన ఖాతాలో వేసుకుని ప్రజలను ఏమారుస్తోందని బీజేపీ రాష్ట్ర సంఘటన్ ఆర్గనైజర్ మధుకర్ వడ్లమాను అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో జరిగిన బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన కేంద్రం అందిస్తున్న పథకాలపై వివ రించారు. బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, జి.ఆర్.కె రంగారావు, కొవ్వలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ పునః నిర్మాణ పనులు



ముసునూరు, ఫిబ్రవరి 10: ముసునూరులో వేంకటాచలుడి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం శిధిలావస్థకు చేరడంతో ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఆలయ పునఃనిర్మాణానికి గత ఏడాది నవంబరు 11న శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పూర్తిస్థాయి బేస్‌మెంట్ వేయడంతో పాటు గర్భాలయ నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నా యి. పనులను ఛైర్మన్ దేవినేని వరప్రసాదరావు, రేగుల రాజా, దేవినేని రామకృష్ణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ

నూజివీడు, ఫిబ్రవరి 10: సీఎం సహాయనిధి ద్వారా అందిన చెక్కులను నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శనివారం పంపిణీ చేశారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో మొత్తం 14 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల చెక్కులను తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు.




నూజివీడు బైపాస్‌లో రోడ్డుమార్జిన్‌లపై పడవేసిన పామాయిల్ చెట్లు

ఏమిటీ నిర్లక్ష్యం..

▸▸రహదారిపైనే ఆయిల్‌పామ్ మొద్దులు

▸▸ఏమరపాటుగా వెళితే ఎంత ప్రమాదం..

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10: కొందరి నిర్లక్ష్యం, మరికొందరికి ప్రాణసంకటంగా మారుతోంది. పామాయిల్ తోటల్లో వయస్సు మీరిన పామాయిల్ చెట్లను రైతులు తొలగిస్తున్నారు. తొలగించిన పామాయిల్ మొద్దులను ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఎమ్‌అండ్‌కే రహదారిలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు బైపాస్ రహదారి మార్జిన్‌లలో రహదారిపైకి వచ్చేలా వదిలివేస్తున్నారు. రాత్రిపూట వేగంగా వెళ్ళే వాహనదారులు మార్జిన్‌లో ఉన్న ఈ చెట్లను గమనించకుండా ఏమరపాటుగా వెళితే ప్రమాదానికి గురికాక తప్పదు. తక్షణం సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారులపై నిర్లక్ష్యంగా వదిలివేసిన పామాయిల్ మొద్దులను తొలగించడంతో పాటు అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పలు భవనాలు ప్రారంభం


పట్టాల పంపిణీ

కలిదిండి, ఫిబ్రవరి 10: గుర్వాయిపాలెంలో రూ. 90 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ శనివారం ప్రారంభించారు. అనంతరం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చెక్కులను వారు పంపిణీ చేశారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కనక దుర్గారాణి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ధనికొండ మేరీ, సొసైటీ అధ్యక్షుడు చినబ్బాయి రాజు, సర్పంచ్ ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, ఎంపీడీవో దినతేజ్, తహసీల్దార్ దశిక వంశీ పాల్గొన్నారు. గోపాలపురంలో నూతనంగా మంజూరైన ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు, తహసీల్దార్ పాల్గొన్నారు.